సాక్షి
పెద్దపల్లి
శుక్రవారం । 29 । మార్చి । 2024



కట్టమైసమ్మకు పూజలు

పెద్దపల్లిరూరల్: ఎల్లమ్మ చెరువు కట్ట మైసమ్మ ఆలయ ప్రతిష్ఠాపనోత్సవం సందర్భంగా ప్రముఖులు, భక్తులు పూజలు చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్ర(సా.)	సహర్ శని(ఉ.)
కరీంనగర్	6.27	4.45
పెద్దపల్లి	6.34	4.50
రాజన్న సిరిసిల్ల	6.34	4.51
జగిత్యాల	6.34	4.50

గరిష్ఠం/కనిష్ఠం
40.3/24.6

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉంది. రాత్రి చలిగా ఉండే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సీపీని కలిసిన సీజీఎం రుూ



సీపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న సుధీర్‌కుమార్

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం ఎరువుల కర్మాగారం సీజీఎం సుధీర్ కుమార్ రుూ గురువారం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి, రక్షణ చర్యలతోపాటు వివిధ అంశాల గురించి సీపీకి వివరించారు. రామగుండం ఎరువుల కర్మాగారాన్ని సందర్శించాలని సీపీని కోరారు.

గ్రాట్యుటీ వర్తింపజేయాలి



వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు

రామగుండం: రైల్వే కాంట్రాక్టు కార్మికులకు చట్టపరమైన బోనస్, గ్రాట్యుటీ వర్తింపజేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి ఎం.రామాచారి కోరారు. గురువారం రైల్వే సీడీఎంఈ, సీనియర్ సెక్షన్ ఇంజినీర్‌తోపాటు ఆర్‌వోహెచ్ సైడింగ్ విభాగాల్లో పనులు చేయించే శ్రీబాలాజీ ఇంజినీరింగ్ ఎంటర్ ప్రైజెస్ ప్రతినిధులకు వినతిపత్రం అందజేశారు. కార్మికులకు వేతనంతో కూడిన 18 లీవులు, 8 జాతీయ సెలవులు, ఏడాదికి రెండు జతల దుస్తులు, సేఫ్టీ షూ, పే స్లిప్స్ అందజేయాలని కోరారు. యూనియన్ నాయకులు బొంకూరి మహేశ్, ఎండీ యాసిన్, మల్లేశ్, ప్రదీప్, అఫ్రోజ్, రమేశ్, తాయర్, అఫ్జల్, ఇఫ్తెకార్ పాల్గొన్నారు.

వేరుశనగ పంట పరిశీలన



పంట పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కమాన్‌పూర్(మంథని): పెంచికల్‌పేటలోని వేరుశన పంటను రామగిరి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పరిశీలించారు. యాసంగి సాగు కోసం కేవీకే ఆధ్వర్యంలో రైతులకు వేరుశనగ విత్తాలు అందజేశారు. వాటితో పండిస్తున్న పంట తీరును శాస్త్రవేత్తలు పరిశీలించారు. దిగుబడికి తీసుకోవాల్సి జాగ్రతల గురించి వివరించారు. కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శ్రీనివాస్, శాస్త్రవేత్తలు కిరణ్, మహేందర్ పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న స్వప్న

సుల్తానాబాద్‌రూరల్: మహిళలు, పిల్లల సంరక్షణ చట్టాలపై అవగాహన అవసరమని మహిళా సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ స్వప్న అన్నారు. గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జెడ్పీ బాలికల హైస్కూల్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్‌తో కలిసి స్వప్న మాట్లాడారు. పోక్సో చట్టం, హెల్ప్‌లైన్ ద్వారా మహిళలు, పిల్లలకు సేవలు అందిస్తున్నామన్నారు. జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ గర్భస్థ లింగ నిర్ధారణ నేరమన్నారు. ప్రిన్సిపాల్ విజయరావు, డాక్టర్ అనుదీప్ ఉన్నారు.

అబ్బాపూర్‌లో విజిలెన్స్ తనిఖీలు



టాయ్‌లెట్లు తనిఖీ చేస్తున్న అధికారులు

జూలపల్లి(పెద్దపల్లి): అబ్బాపూర్, జూలపల్లిలో ఉపాధిహామీ ద్వారా నిర్మించిన వ్యక్తిగత లెట్రిన్లను జిల్లా విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీ చేశారు. బిల్లుల గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. బిల్లుల చెల్లింపుల్లో తలెత్తే ఇబ్బందులపై ఈజీఎస్ సిబ్బందిని ప్రశ్నించారు. విజిలెన్స్ ఆఫీసర్ కొమురయ్య మాట్లాడుతూ, పనుల్లో పారదర్శకత పాటించాలన్నారు. ఎస్పీఎం ఐఈసీ అధికారి రాఘవులు, ఏపీవో సదానందం, టీఏ శ్రీకర్, ఎఫ్ఏ తిరుపతి, పంచాయతీ కార్యదర్శి రవీందర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న టెన్త్ పరీక్షలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో పదో తరగతి పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయని డీఈవో మాధవి తెలిపారు. జిల్లావ్యాప్తంగా 7,716 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని పేర్కొన్నారు. మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ మూడు బృందాలు, అసిస్టెంట్ కమిషనర్, డీఈవో పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.

కాల్ రికార్డ్స్ ఖతం!

సిరిసిల్ల హార్డ్‌డిస్క్‌లు ధ్వంసం

- జిల్లా కేంద్రంగా వార్ రూంను గుర్తించిన పోలీసులు
- స్థానిక నేత ఇచ్చిన నంబర్లు ఇక్కడి నుంచే ట్యాప్
- 12న డీఎస్పీ ప్రణీత్‌రావు అరెస్టు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బాధితులు?
- వీరిలో ఎక్కువ మంది కాంగ్రెస్ నేతలు, సీఎం అనుచరులే..



సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. ఇది హైదరాబాద్‌లోని ఎస్ఐబీ కార్యాలయం కేంద్రంగా సాగగా సిరిసిల్ల, వరంగల్‌లో ఎస్ఐబీ పోలీసులు కొందరు వార్ రూంలు ఏర్పాటు చేసి, ట్యాపింగ్‌కు పాల్పడ్డారు. వరంగల్‌లో ఓ నాయకుడు చెప్పిన నంబర్లు ట్యాప్ చేసినట్లుగా ఆరోపణలు వస్తుండగా అదే తరహాలో సిరిసిల్లలోనూ జరిగినట్లు పోలీసులు గుర్తించారు. సిరిసిల్లకు చెందిన ఓ కీలక నేత కూడా కొన్ని నంబర్లు ఇచ్చి, స్థానిక వార్ రూం ద్వారా పలువురు ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ చేసినట్లు నిర్ధారించారు. పంజగుట్ట పోలీసుల విచారణలో ఆ నాయకుడు ఎవరు? ట్యాప్ చేయమని ఎవరెవరి నంబర్లు ఇచ్చాడు? వార్ రూం ఎక్కడ నుంచి నిర్వహించారు? అందులో ఎవరెవరు పని చేశారు? తదితర అంశాలపై విచారణ అధికారులు వివరాలు సేకరించినట్లు సమాచారం. ట్యాప్ అయిన జాబితాలోని మెజారిటీ వ్యక్తులు కాంగ్రెస్ సీనియర్లు, అందులోనూ సీఎం రేవంత్‌రెడ్డికి సన్నిహితులు కావడం గమనార్హం.

వార్ రూం ఎంతకాలం నడిచిందో?


గత డిసెంబర్ 4న ఎన్నికల ఫలితాలతో అప్రమత్తమైన అప్పటి సిరిసిల్ల డీఎస్పీ ప్రణీత్‌రావు సీసీ కెమెరాలు ఆపేసి, వార్ రూంలోని దాదాపు 50 హార్డ్ డిస్కులను ధ్వంసం చేసిన విషయం విదితమే. దీనిపై మార్చి 10న పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదవడం, 12న డీఎస్పీని సిరిసిల్లలో అరెస్టు చేయడం చకచకా జరిగిపోయాయి. ప్రణీత్‌రావు, ఆయన బృందం రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంగానే వార్ రూం ఏర్పాటు చేసినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. అది ఎంతకాలం నడిచింది? ఎవరెవరి కాల్స్ రికార్డ్ చేశారు? అన్న విషయాలపై పోలీసులు కూపీ లాగుతున్నారు. వార్ రూం నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన ఎస్సై, ముగ్గురు కానిస్టేబుళ్ల ద్వారా వివరాలు సేకరించినట్లు తెలిసింది. వీరు ట్యాప్ చేసిన కాల్స్‌లో ముఖ్యమైన వాటిని కాపీ చేసి, ప్రణీత్‌రావుకు ఇచ్చేవారని సమాచారం. ప్రణీత్‌రావు ధ్వంసం చేసిన హార్డ్ డిస్కుల్లో సిరిసిల్ల కాల్ రికార్డ్స్ కూడా ఉన్నాయని సమాచారం.

సిరిసిల్లకే పరిమితం కాలేదా?

వార్ రూంలో పనిచేసిన సభ్యులు కేవలం సిరిసిల్లకు మాత్రమే పరిమితం కాలేదని, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ చేసినట్లు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. ముఖ్యంగా పెద్దపల్లిలో ముగ్గురు కీలక ప్రతిపక్ష నేతల అనుచరులకు చెందిన కోట్లాది రూపాయలను అసెంబ్లీ ఎన్నికల సమయంలో పోలీసులు ఉమ్మడి జిల్లాతోపాటు, హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో పట్టుకున్నారు. కరీంనగర్, జగిత్యాల ప్రతిపక్ష నేతలు డబ్బులు ఖర్చు చేయకుండా వారికున్న ఆర్థిక మూలాలను ముందే గుర్తించి, కట్టడి చేశారన్న దిశగానూ దర్యాప్తు సాగుతోంది. సూట్‌కేసు పరిమాణంలో ఉండే ట్యాపింగ్ పరికరాలను ఓ వ్యాన్‌లో పెట్టుకొని, టార్గెట్ చేసిన నాయకుడి ఇంటికి 200 మీటర్ల దూరంలో ఉంటే చాలు.. ఆయన కాల్స్ మాత్రమే కాదు, ఇంట్లోవారు, ఆ చుట్టుపక్కల వారి కాల్స్ కూడా వినే వీలుంటుంది.

2022లోనే అనుమానించిన ఎంపీ సంజయ్

2022 మే 25వ తేదీన అప్పటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కరీంనగర్‌లోని ఓ ప్రధాన మీడియా సంస్థ విలేకరితో హిందూ ఏక్తా యాత్రపై చర్చించారు. ఆ ఫోన్ కట్ అయిన కొన్ని నిమిషాల్లోనే ఎంపీ నివాసాన్ని పోలీసులు చుట్టుముట్టారు. దీంతో ఆయన అనుచరులు సదరు విలేకరే పోలీసులకు సమాచారం ఇచ్చాడంటూ వాగ్వాదానికి దిగారు. ఈ ఘటనతోపాటు మరిన్ని సంఘటనలు గుర్తు చేసుకున్న ఎంపీ సంజయ్ తనతోపాటు తన అనుచరుల ఫోన్లను ట్యాప్ చేసినట్లు అనుమానించారు.



'ఎల్లంపల్లి'కి భానుడి తిలకం

రోజంతా నిప్పులు కురిపించిన భానుడు సంధ్యాసమయంలో ఆకట్టుకున్నాడు. ఒకవైపు జలాశయంలో చేపలవేటలో ఉన్న జాలరి.. మరోవైపు అస్తమిస్తున్న సూర్యుడి ప్రతిబింబం నీటిలో అందంగా కనిపిస్తుండగా... ఆకాశం నుదుటన సింధూరం పెట్టుకుందా అన్నట్లు ఆకట్టుకున్న ఈ అద్భుత దృశ్యం పెద్దపల్లి జిల్లా రామగుండం ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద 'సాక్షి' కెమెరాకు కనిపించింది.– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

భ్రూణహత్యలు అరికట్టాలి

- లింగ నిర్ధారణ చట్టరీత్యా నిషేధం
- అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

జ్యోతినగర్(రామగుండం): పురుష సంతతి కోసం జరిగే భ్రూణ హత్యలను అరికట్టాలని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ సూచించారు. ఎన్టీపీసీ ఉద్యోగ వికాస కేంద్రంలో గురువారం 'భేటీ బచావో.. భేటీ పడావో'పై సమావేశం నిర్వహించారు. భ్రూణహత్యలతో ఆడపిల్లల సంఖ్య వేగంగా పడిపోతోందన్నారు. లింగ నిర్ధారణ, గర్భస్రావాలు చట్టరీత్యా నేరమని తెలిపారు. మహిళా సాధికారిత కో ఆర్డినేటర్ దయా అరుణ మాట్లాడుతూ, మహిళల హక్కుల పరిరక్షణే సాధికారిత ఉద్దేశమన్నారు. మహిళా సమస్యల పరిష్కారం, ఫిర్యాదుల కోసం 104, 1098, మానసిక ఒత్తిడికి లోనైన వారు 144617, పిల్లల దీర్ఘకాలిక సమస్యల కోసం 1098, వృద్ధుల కోసం 1456, దివ్యాంగుల కోసం 11326, స్వీప్ ప్రోగ్రాం కోసం 1950, సైబర్ క్రైమ్ కోసం 1930 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్‌చేసి సమస్యలు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల ప్రాముఖ్యత గురించి జిల్లా సంక్షేమ అధికారి రవుఫ్‌ఖాన్ వివరించారు. డెప్యూటీ డీఎంహెచ్ఎంవో కృపాబాయి, డీసీపీవో పర్వీన్, సీడీపీవోలు కవిత, స్వరూపరాణి, మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్లతో సమావేశం

నియోజకవర్గంలోని బ్యాంకు మేనేజర్లతో అదనపు కలెక్టర్ అరుణశ్రీ సమావేశం నిర్వహించారు. అనుమానాస్పద లావాదేవీలపై చర్చించారు. అంతర్గాం తహసీల్దార్ రామ్మోహన్, డిప్యూటీ తహసీల్దార్లు తిరుపతి, విజయ్, బ్యాంకర్లు పాల్గొన్నారు.

ఓటు ప్రాముఖ్యతపై ప్రచారం

పెద్దపల్లిరూరల్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుకు ఎంతో ప్రాముఖ్యం ఉందని, ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం అధికారులతో సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. పెద్దపల్లి, మంథని, రామగుండం సెగ్మెంట్లలో 7,15,735 మంది ఓటర్లు ఉన్నారని, అందరూ ఓటుహక్కు వినియోగించుకునేలా విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్‌శాతం తక్కువగా నమోదైన కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఆర్డీవోలు హనుమా నాయక్, గంగయ్య, జెడ్పీ సీఈవో నరేందర్, డీఆర్డీవో రవీందర్, డీపీవో ఆశాలత, డీఈవో మాధవి, నోడల్ అధికారి రవుఫ్‌ఖాన్, డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, ఇంటర్ విద్య నోడల్ అధికారి కల్పన, ఇండస్ట్రియల్ జీఎం మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి శ్రద్ధతోనే ఐఏఎస్‌కు ఎంపిక

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: ప్రతీ మనిషి జీవితంలో చిన్నఅంశాలే గొప్ప మార్పు తెస్తాయని, ఏడో తరగతి వరకు సాధారణ విద్యార్థిగా ఉన్న తనపై ఉపాధ్యాయుడు చూపిన ప్రత్యేక శ్రద్ధ తాను ఐఏఎస్‌కు ఎంపికయ్యేలా చేసిందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం సమ్మర్ క్యాంపు(పిల్లల సందర్శన) వలంటీర్లకు నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. సేవలు అందించేందుకు ముందుకొచ్చిన వలంటీకంల పాత్ర చాలాగొప్పదన్నారు. భావిభారత పౌరులకు మంచి అంశాలపై అవగాహన పెంపొందించాలన్నారు. గ్రామాల్లో 3, 4, 5వ తరగతులు చదివే విద్యార్థులకు సేవలు అందించేందుకు ముందుకొచ్చిన వారితో సమన్వయం చేసేలా హెచ్ఎంలు సహకరించాలని కలెక్టర్ సూచించారు. వలంటీర్లుగా అందించే సేవలు సంతృప్తి ఇస్తాయని పేర్కొన్నారు. చిన్నపిల్లలకు నేర్పించే పాఠాలు వారి భవిష్యత్‌పై ఎంతో ప్రభావం చూపుతాయని అన్నారు. డీఈవో మాధవి, అకడమిక్ అధికారి షేక్, భారత్‌దేఖో టీం సభ్యులు, ఎంఈవో, టీచర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయపు పన్ను మినహాయింపుపై ఒత్తిడి తెస్తాం

- పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తే సింగరేణి కార్మికుల ఆదాయ పన్ను మినహాయింపుపై కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ హామీ ఇచ్చారు. గురువారం స్థానిక సాయిలీల రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవసరమైతే అన్నికార్మిక సంఘాలను ఏకంచేసి ఢిల్లీకి తీసుకెళ్లి పోరాటం చేస్తామన్నారు. తమ ప్రభుత్వం ఇప్పటికే అసెంబ్లీలో తీర్మా నం చేసి కేంద్రప్రభుత్వానికి పంపించిందన్నారు. అయినా, బీజేపీ ప్రభుత్వం దానిని పక్కన పెట్టింద ని విమర్శించారు. ఆదాయపు పన్ను సింగరేణి భరి స్తుందా? రాష్ట్రం లేక కేంద్ర ప్రభుత్వం భరిస్తుందా? అనేదానితో సంబంధం లేదన్నారు. ప్రాణాలను ప ణంగా పెట్టి బొగ్గు ఉత్పత్తి చేస్తున్న కార్మికులకు ఇన్‌కం ట్యాక్స్ మినహాయింపు ఉండాల్సిందేనని అన్నారు. బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ కార్మికులకు ఇంటి సమస్య పరిష్కారం చేస్తామన్నారు. వలసవాదులను కాకుండా స్థానికుడిగా, సింగరేణి కార్మికుడి బిడ్డగా తనను గెలిపిస్తే సమస్యల పరిష్కారం కోసం పార్లమెంట్‌లో పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. నాయకులు బాల్క సుమన్, ఆర్ఎస్ ప్రవీణ్, కోరుకంటి చందర్, మురళీధర్‌రావు, రాజేశ్, స్వామి పాల్గొన్నారు.

పంటలు ఎండిపోకుండా చర్యలు



పైప్‌లైన్ వాల్వ్ తెరుస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మారం(ధర్మపురి): వరి పంట ఎండిపోకుండా అవకాశంఉన్న ప్రతీచోట ఎల్లంపల్లి పైప్‌లైన్ వాల్వ్‌లు తెరిచి కుంటలు, చెరువులు నింపి సాగునీరు అందదిస్తామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. బైరెడ్డిపల్లి వద్ద గల ఎల్లంపల్లి పైప్‌లైన్ వాల్వ్‌ను గురువారం యాయన తెరిచి పులిచేరువులోకి నీటిని వదిలారు. ధర్మారం, వెల్గటూర్, ఎండపల్లి మండలాల్లో విస్తరించిన ఎల్లంపల్లి పైప్‌లైన్ వాల్వ్‌లు తెరిచి సాగునీరు అందిస్తామని తెలిపారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న కొప్పుల ఈశ్వర్ సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించలేదని విమర్శించారు. కేవలం కేసీఆర్, కేటీఆర్ మెప్పు కోసమే మంత్రిగా పనిచేశారని, రైతుల సమస్యలు పట్టించుకోలేదని దుయ్యబట్టారు. అనంతరం మల్లాపూర్ ఎస్సీకాలనీని సందర్శించారు. తాగునీటి సమస్యలపై మహిళలతో మాట్లాడారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మహిపాల్ పాల్గొన్నారు.

తుదిదశకు రైల్వే ఫ్లై ఓవర్ వంతెన

- వాహనదారుల్లో సంతోషం



వంతెనపై పూర్తయిన తారురోడ్డు

పాలకుర్తి(రామగుండం): హైదరాబాద్ – రామగుండం ఫోర్‌లేన్ రహదారిపై బసంత్‌నగర్ సమీపంలో అసంపూర్తిగా ఉన్న రైల్వే ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణం తుదిదశకు చేరింది. మరో 15 – 20 రోజుల్లో పనులు పూర్తికానుండటంతో వాహనదారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

హైవే పూర్తయినా.. ఆగిన వంతెన పనులు

- రాజీవ్ రహదారి విస్తరణలో భాగంగా 2010లో హైదరాబాద్ – మంచిర్యాల జిల్లా ఇందారం వరకు దాదాపు 250 కి.మీ. పొడవున అప్పటి కాంగ్రెస్ సర్కార్ ఫోర్‌లేన్ నిర్మాణం చేపట్టింది.
- దాదాపు నాలుగేళ్లలో పనులు పూర్తయినా.. బసంత్‌నగర్ సమీపంలోని రైల్వే ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణం పూర్తికాలేదు.
- రైల్వేశాఖ నుంచి అనుమతి లభించక రోడ్డు నిర్మాణ సంస్థ బ్రిడ్జి పనులు చేపట్టలేదు.
- దీంతో వాహనదారులకు వన్‌వేనే దిక్కయ్యింది.
- అది ఇరుకుగా ఉండడంతో 80 కి.మీ. నుంచి 100 కి.మీ. వేగంతో వచ్చే వాహనాలు ఇరుకు రోడ్డు వద్ద అదుపుతప్పి సమీపంలోని లోయలోకి దూసుకెళ్తున్నాయి.
- ఈ ప్రమాదాల్లో పదుల సంఖ్యలో వాహనదారులు ప్రాణాలు కోల్పోయారు.
- దాదాపు ఎనిమిదేళ్ల అనంతరం 2022లో అప్పటి రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్.. సమస్యను అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు.
- స్పందించిన కేసీఆర్.. వంతెన నిర్మాణం చేపట్టాలని రైల్వే, ఆర్ అండ్ బీ ఉన్నతాధికారులను ఆదేశించారు.
- అంతేకాదు.. ఇందుకు అవసరమైన రూ.10.17కోట్లు మంజూరు చేశారు.
- దీంతో 2022 ఫిబ్రవరిలో ఫ్లై ఓవర్ వంతెన పనులు ప్రారంభించిన కాంట్రాక్ట్ సంస్థ రెండేళ్లలో పనులు పూర్తిచేసింది.
- ప్రస్తుతం బ్రిడ్జితోపాటు ఇరువైపులా రోడ్డు నిర్మాణం పూర్తికాగా, రెయిలింగ్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.
- కొద్దిరోజుల్లోనే రైల్వే ఫ్లై ఓవర్ అందుబాటులోకి రానుండడంతో వాహనదారులే కాదు.. స్థానికులు, ప్రయాణికులూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



క్యూలైన్‌లో భక్తులు

రాజన్న కల్యాణం.. కమనీయం



కన్యాదాతలు భీమాశంకరశర్మ- ఇందిర



తాళి చూపెడుతున్న వేదపండితుడు

వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధిలో పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గురువారం ఉదయం 10.50 గంటలకు ఆలయ చైర్మన్ చాంబర్ ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై వేదమూర్తుల మంత్రోచ్ఛరణల మధ్య, భాజాభజంత్రీలతో కల్యాణం జరిగింది. మున్సిపల్ కమిషనర్ అన్వేశ్ పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఎదుర్కోళ్ల కార్యక్రమం అనంతరం స్వామివారి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. సాయంత్రం పెద్ద సేవపై ఊరేగించారు. దాదాపు లక్ష మంది వరకు భక్తులు హాజరయ్యారు.

సకాలంలో రారైస్ డెలివరీ పూర్తిచేయండి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

పెద్దపల్లిరూరల్: వానాకాలం పెండింగ్‌లో ఉన్న రారైస్‌ను సకాలంలో డెలివరీ చేయాలని అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం రా రైస్‌మిల్లర్లతో సమావేశమై పలు అంశాలపై సూచనలు ఇచ్చారు. ఇప్పటికే బకాయి ఉన్న రైస్ డెలివరీ విషయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఎస్‌వో ప్రేంకుమార్, డీటీసీఎస్‌తోపాటు మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టెట్ ఫీజు తగ్గించాలి



మాట్లాడుతున్న కుమార్

కరీంనగర్: టెట్ ఫీజు తగ్గించాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ అన్నారు. గురువారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఒక పేపర్ రాస్తే రూ.200, రెండు పేపర్లు రాస్తే రూ.400 ఫీజు ఉండేదన్నారు. ప్రస్తుతం రూ.1,000, రూ.2000కు పెంచడంతో నిరుద్యోగులపై భారం పడుతోందని పేర్కొన్నారు. వారి భవిష్యత్‌ను దృష్టిలో పెటుకొని, పాత ఫీజు విధానాన్నే కొనసాగించాలని కోరారు. సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు లోకిని రమేశ్, రాజేశ్, శ్రవణ్ పాల్గొన్నారు.

గొర్రెపల్లిలో కలప పట్టివేత



అధికారులు పట్టుకున్న దుంగలు

మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని గొర్రెపల్లి శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన కలపను పట్టుకున్నట్లు భూపతిపూర్ డిప్యూటీ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, ఇన్‌చార్జి ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ చంద్రమౌళి తెలిపారు. వారి వివరాల ప్రకారం .. కలప అక్రమ రవాణాపై సమాచారంతో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది గురువారం దాడులు నిర్వహించారు. గొర్రెపల్లి శివారులోని ఓ పశువుల పాకలో 42 దుంగలను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని, అటవీ రేంజ్ కార్యాలయానికి తరలించామన్నారు. బీట్ ఆఫీసర్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో జైలు

మంథని: భట్టుపల్లికి చెందిన దూపం శ్రీనివాస్‌పై గొడ్డలితో దాడి చేసిన కేసులో అదే గ్రామానికి చెందిన గుండ్ల సదయ్యకు మంథని సీనియర్ సివిల్ జడ్జి భారతి జైలుశిక్ష, జరిమానా విధించారు. వివరాల్లోకి వెళ్తే.. 11.05.2023న శ్రీనివాస్‌పై సదయ్య గొడ్డలితో దాడి చేశాడు. ఈ ఘటనలో శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి. చంపాలన్న ఉద్దేశంతోనే ఇలా చేశాడని బాధితుడి భార్య స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసి, దర్యాప్తు పూర్తి చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి గురువారం సదయ్యకు మూడేళ్ల జైలుశిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

లైన్‌మెన్‌కు తీవ్ర గాయాలు

మానకొండూర్: అన్నారం గ్రామంలో జూనియర్ లైన్‌మెన్ బాలకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. గురువారం విధి నిర్వహణలో భాగంగా ఆయన విద్యుత్ స్తంభంపై మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డారని పేర్కొన్నారు. వెంటనే కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.



శ్రీవేంకటేశ్వర స్వామి పల్లకిని మోస్తున్న పోలీసులు



పోలీస్‌స్టేషన్‌లో పూజలందుకుంటున్న స్వామివారు

పోలీస్‌స్టేషన్‌లో శ్రీవేంకటేశ్వరునికి పూజలు

- వైభవంగా దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవేంకటేశ్వరస్వామికి గురువారం దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలను అంగరంగ వైభవంగా జరిపారు. ధర్మపురి పోలీస్‌స్టేషన్‌కు చేరిన స్వామివారికి సీఐ రాం నర్సింహారెడ్డి, ఎస్సై ఉదయ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేయించారు. ముందుగా ఆలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు అశ్వవాహనంపై శోభాయాత్రగా తీసుకెళ్లారు. స్వాములవారు పోలీస్‌స్టేషన్‌లో పూజలు అందుకోవడం ధర్మపురిలో నేటికీ కొనసాగుతోంది. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు, కౌన్సిలర్లు తదితరులున్నారు.

నేడు శ్రీలక్ష్మీనృసింహుడి రథోత్సవం

శ్రీలక్ష్మీనృసింహ స్వామి రథోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించనున్నారు. ముగ్గురు స్వాములైన లక్ష్మీనృసింహుడితోపాటు శ్రీవేంకటేశ్వరస్వామి, రామలింగేశ్వర స్వాములను రథాలపై ఆలయం నుంచి నందీకూడలి వరకు రథాలపై ఊరేగిస్తారు. గోదావరి నదికి తీసుకెళ్లి స్వామివార్లకు చక్రస్నానం, ఇతర పూజలు జరిపిస్తారు.

రోజూ కూలి రూ.300

- ఉపాధి కూలీలకు పెరిగిన వేతనం
- ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమలు
- ఆదేశాలు జారీ చేసిన కేంద్రప్రభుత్వం

జిల్లా సమాచారం	
జాబ్‌కార్డుల సంఖ్య	1,17,673
నమోదైన కూలీలు	2,41,076
ఉపాధి పొందుతున్న కూలీలు	1,25,123



పెద్దపల్లి శివారులోని చెరువులో పనిచేస్తున్న ఉపాధికూలీలు(ఫైల్)

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఉపాధిహామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు వేతనం పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి పెంచిన వేతనం రూ.300 చెల్లింపు అమల్లోకి వస్తుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. జిల్లాలో ప్రస్తుతం పనిచేస్తున్న కూలీలకు రోజువారీ వేతనం రూ.272గా ఉంది. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి మరో రూ.28 పెంచి రూ.300 చెల్లించనున్నారు. ఈ పెంపుతో కూలీలకు కొంత మేర ప్రయోజనం కలుగుతుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఊపందుకుంటున్న 'ఉపాధి' పనులు

- మరికొద్ది రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుంది.
- అయితే, నిర్దేశిత లక్ష్య సాధన కోసం ఇపుడిపుడే ఉపాధి పనులు ఊపందుకుంటున్నాయి.
- కొద్దిరోజుల కిందటి వరకు వ్యవసాయ పనుల్లో కూలీలు బిజీగా ఉండడంతో ఉపాధి పనులు మందకొడిగా సాగాయి.
- ఆ పనులు ముగిసిన తర్వాత ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య క్రమంగా పెరుగుతోంది.
- ఈనెలాఖరుతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనుండగా లక్ష్యానికి చేరువ కావాలనే ఆలోచనతో ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది చెరువులు, కాలువల పూడికతీత లాంటి పనులు చేయిస్తున్నారు.
- రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగింపజేస్తున్నారు.

ఏప్రిల్ 1 నుంచి రూ.28 పెంపు

ఇప్పటిదాకా ఉపాధి పనులు చేసిన కూలీలకు గరిష్ఠంగా రూ.272 చెల్లించగా ఆ పనికే ఏప్రిల్ 1 నుంచి మరో రూ.28 కలిపి రూ.300 చెల్లించేలా కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ పెంపుతో కూలీలకు కొంతమేర ప్రయోజనం కలుగుతుంది.

ఆనందంగా ఉంది



ఉపాధిపనులు చేసే కూలీలకు వేతనాలు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉంది. అయితే మార్కెట్‌లో ధరలకు అనుగుణంగా మరికొంత పెంచి ఇస్తే బాగుండేది.

– కలవేన సదానందం, కూలీ, పెద్దబొంకూర్

పూట గడుస్తోంది



ఉపాధిహామీ పథకంతోటి ఊళ్లలో సమస్యలను పరిష్కరించుకోవడంతోపాటు మాలాంటి పేదోళ్లకు ఉపాధి దొరుకుతోంది. ఈ పనులకు వెళ్లడం ద్వారా పూట గడుస్తోంది.

– కారుపాకల మల్లమ్మ, కూలీ, పెద్దబొంకూర్

పనులు కల్పిస్తున్నాం



జాబ్‌కార్డులు పొందిన కుటుంబాలకు ఉపాధి పనులు కల్పిస్తున్నాం. గ్రామసభల్లో తీర్మానించిన మేరకే పనులు చేపడుతున్నాం. ఎండలతో కూలీలకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– రమేశ్, ఏపీఎం, ఈజీఎస్, పెద్దపల్లి

ఏసుక్రీస్తు తిరిగొచ్చారని.. స్మరిస్తూ..

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు
- నేడు గుడ్‌ఫ్రైడే



ముస్తాబైన మంథనిలోని చర్చి

మంథని: క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను పవిత్రమైన రోజుగా భావిస్తారు. ఏసుక్రీస్తుకు శిలువ వేసిన ఈరోజును గుర్తుచేసుకుంటూ గుడ్‌ఫ్రైడే జరుపుకుంటారు. ప్రజల రక్షణ కోసం ఏసుక్రీస్తు తన జీవితం త్యాగం చేశాడని నమ్ముతారు. ఈ నేపథ్యంలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే జరుపుకునేందుకు క్రైస్తవులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఈస్టర్‌కు రెండ్రోజుల ముందు..

ఏసుక్రీస్తు పునరుత్థానం లేదా.. ఆయన తిరిగొచ్చారని నమ్ముతూ క్రైస్తవులు ఈస్టర్(ఆదివారం)కు రెండురోజుల ముందు గుడ్‌ఫ్రైడే జరుపుకుంటారు. వీటిని సంతాప దినాలుగా పరిగణిస్తారు. ఈసమయంలో వేడుకలు, ప్రత్యేక విందులకు దూరంగా ఉంటారు. మాంసహారం తీసుకోరు. కఠినమైన ఉపవాస దీక్ష చేపడతారు. క్రైస్తవ మతవిశ్వాసాల ప్రకారం ఏసుక్రీస్తును దేవుని బిడ్డగా భావిస్తారు. ప్రపంచంలో నెలకొన్న చీకట్లను తొలిగించడానికి వచ్చారని నమ్ముతారు. అయితే ఏసుక్రీస్తు ప్రయత్నాలను యూదులు అడ్డుకున్నారు. తమ ఆధిపత్యం కోసం ఏసయ్యను వ్యతిరేకిస్తారు. అక్కడితో ఆగకుండా శిలువపై వేలాడదీస్తారు. ఆ సమయంలో «దేవా!.. వారు ఏం చేస్తున్నారో వారికి తెలియదు.. కావున వారిని క్షమించండి» అని యేసయ్య చెప్పినట్లు నమ్ముతారు. తన శత్రువులను కూడా ప్రేమించాలని, మంచిగా ఉండాలనే కోరికతోనే ఈరోజును గుడ్ ఫ్రైడేగా పిలుస్తారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఏసుక్రీస్తును స్మరించుకుంటూ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. శిలువ వేయడానికి గల కారణాలు గుర్తు చేసుకుంటారు. యేసయ్య శిలువలోని తన రక్తంతో ప్రజలను పాపాల నుంచి రక్షించాడని మరికొందరు నమ్ముతారు. మరి కొందరు తమ పూర్వీకుల సమాధి వద్దకు వెళ్లి కొవ్వొత్తులు వెలిగించి సంతాపం వ్యక్తం చేస్తారు. చాలామంది శిలువలు, క్రీస్తు చిత్రపటాలు, విగ్రహాలపై నల్లని వస్త్రాలు కప్పుతారు. ఈస్టర్ సందర్భంగా ఏసు జీవించి ఉన్నారనే సంతోషంతో బహుమతులు పంపిణీ చేస్తారు. ఏసుక్రీస్తు సిలువలో పలికిన చివరి ఏడు మాటలను ధ్యానం చేస్తూ ప్రపంచంలోని అన్నిచర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మంథని నియోజకవర్గంలోని చర్చిల్లో కార్యక్రమాల నిర్వహణకు పాస్టర్లు, సంఘం పెద్దలు, విశ్వాసులు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు.

కొత్త గనులు తవ్విస్తాం.. ఉద్యోగాలు ఇప్పిస్తాం

- బీజేపీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్



మాట్లాడుతున్న గోమాస శ్రీనివాస్

గోదావరిఖని: సింగరేణిలో భూ గర్భగనులు తవ్వించి ఈప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పెద్దపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ హామీ ఇచ్చారు. స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. సింగరేణి కార్మికులకు ఆదాయపు పన్ను రద్దు చేయిస్తామన్నారు. ఎన్నికల్లో ప్రతీకార్యకర్త అహర్నిశలు శ్రమిస్తూ గడపగడపకూ వెళ్లి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలని కోరారు. తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కుటుంబ పాలనకు స్వస్తి పలకాలని వివేక్ కుటుంబంపై ధ్వజమెత్తారు. దశాబ్దాలుగా వివేక్ కుటుంబమే అధికారం దక్కించుకొని రూ.లక్షల కోట్లు ఆస్తులు గడిస్తూ ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. రాజకీయ భవిష్యత్ లేని తన కుమారుడిని ఇప్పుడు తీసుకొచ్చి పెద్దపల్లి ఎంపీగా గెలిపించాలని కోరుతున్నారని మండిపడ్డారు. పేద కుటుంబం నుంచి వచ్చిన తనను ఎంపీగా గెలిస్తే నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, నాయకులు రావుల రాజేందర్, బల్మూరి వనిత, అమరేందర్‌రావు, క్యాతం వెంకటరమణ, పర్వతాలు, వెంకటేశ్ ఉన్నారు.

305 కేంద్రాలు.. 3లక్షల టన్నులు

- యాసంగి ధాన్యం సేకరణకు సర్వసన్నద్ధం
- ఏప్రిల్ ఒకటి నుంచి దశల వారీగా సెంటర్ల ఏర్పాటు



పెద్దపల్లిరూరల్: జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లకు అధికార యంత్రాంగం సర్వసన్నద్ధమైంది. మొత్తం 14 మండలాల్లో సుమారు రెండు లక్షలపైచిలుకు ఎకరాల విస్తీర్ణంలో వరి సాగైందని అధికారులు అంచనా వేశారు. ఈమేరకు 305 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి దాదాపు 3.04లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అయితే, ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి దశలవారీగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

సేకరణ సాఫీగా సాగేలా..

జిల్లాలో ఇపుడిపుడే వరి కోతలు ఆరంభమవుతున్నాయి. అయితే, సేకరణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు అధికారులు కార్యాచరణ చేపట్టారు. ఎండలు ఇపుడే మండిపోతుండడంతో కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతుల కోసం చలువపందిళ్లు వేయిస్తున్నారు. దాహం తీర్చేందుకు తాగునీటి వసతి కల్పించడం లాంటి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

కొనుగోలు కేంద్రాల వివరాలివీ..

- జిల్లాలో ఈసారి 305 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు.
- సహకార శాఖ ఆధ్వర్యంలో అత్యధికంగా 225, సెర్ప్ ద్వారా 60, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 15, మార్కెట్ కమిటీల ద్వారా 5 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారు.
- ఆయా కేంద్రాలకు రైతులు తెచ్చే ధాన్యాన్ని నిబంధనల ప్రకారం కొనుగోలు చేసేందుకు యంత్ర పరికరాలు అందుబాటులోకి తెస్తున్నారు.
- వడ్లలో మట్టిపెల్లలు, తాలు లేకుండా ప్యాడీక్లీనర్లు 67, తేమ నిర్ధారించే 360 యంత్రాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు.
- అకాల వర్షాలు కురిస్తే ధాన్యం తడవకుండా కాపాడేందుకు అవసరమైన టార్పాలిన్లు దాదాపు 5వేల దాకా ఉన్నాయని పేర్కొన్నారు.
- 75లక్షల గన్నీ సంచులు అవసరం కాగా ఇప్పటి వరకు 52లక్షలు అందుబాటులో ఉన్నాయని, ఇంకా అవసరమతే తెప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.
- కొనుగోలు చేసిన ధాన్యాన్ని రవాణా చేసేందుకు అవసరమైన లారీలను సిద్ధం చేసే పనుల్లో నిమగ్నమయ్యారు.
- హమాలీల సమస్య తలెత్తకుండా చూడడంతోపాటు రైస్ మిల్లర్లు కోత విధించకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు.

కేంద్రాల ప్రారంభానికి నేతలు దూరం..

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు ప్రజాప్రతినిధులు దూరంగానే ఉండాల్సి వస్తోంది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అవకాశం లేకుండా పోయింది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రారంభమయ్యే ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులే ప్రారంభించి కొనుగోలు చేస్తారు. ఎన్నికల ప్రవర్తనానియమావళిని కచ్చితంగా అమలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. ఈమేరకు జిల్లా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు.

బీజేపీ స్థానాల్లో కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థులు

- మరో ఏక్‌నాథ్ షిండే కానున్న రేవంత్‌రెడ్డి
- బీఆర్‌ఎస్ నేత బాల్క సుమన్



మాట్లాడుతున్న సుమన్

గోదావరిఖని: బీజేపీ బలంగా ఉన్న పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థులను నిలబెడుతోందని బీఆర్‌ఎస్ నేత బాల్క సుమన్ విమర్శించారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ఓ హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దపల్లి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, నాగర్‌కర్నూల ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. బీజేపీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుకూలంగా మారి మరో ఏక్‌నాథ్‌షిండే అవతారం ఎత్తారని ఎద్దేవా చేశారు. తమ ఉనికి కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దుర్మార్గంలా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను అన్యాయంగా జైల్లో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులపై ఈడీ దాడులు హేయమన్నా రు. వందరోజుల్లో అన్నీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక ప్రజలను మో సం చేసిందన్నారు. కాంట్రాక్టర్ల నుంచి పెద్దమొత్తంలో ముడుపులు వసూలు చేసి ఢిల్లీకి పంపుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ తీరుతో నీరు అందక 20లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని పేర్కొన్నారు. అప్పులు చెల్లించని రైతులను అవమానపరుస్తూ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. రైతుబంధు, రుణ మాఫీతోపాటు ఇచ్చిన మాటకు కట్టుబడి లేదని అన్నారు. దళితుడు వర్సెస్ ధనవంతుడు మధ్య జరుగుతున్న పోరులో కార్మిక నేతగా, ఈప్రాంత బిడ్డగా ఎంతో అనుభవం ఉన్న బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

ఆకట్టుకున్న మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న రెస్క్యూ టీం

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం ఫెర్టిలైజర్స్, కెమికల్స్ లిమిటెడ్‌తోపాటు ఐవోసీఎల్, ఇతర గ్యాస్ ఆధారిత పరిశ్రమలకు జీఎస్‌పీఎల్ ఇండియా ట్రాన్స్‌కో లిమిటెడ్, కుందనపల్లి నుంచి రామగుండం వరకు పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేస్తోంది. అయితే, గ్యాస్ సరఫరా సమయంలో లీకేజీ సమస్య ఏర్పడితే స్పందించడం, నియంత్రణ చర్యలు తీసుకోవడం తదితర చర్యలపై రెస్క్యూ సభ్యులు గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. పైప్‌లైన్‌లో గ్యాస్ లీకేజీ, ఎగిసిన మంటలను అదుపు చేయడం, గాయాల పాలైన వారిని ఆస్పత్రికి తరలించడం తదితర విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, రామగుండం కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్, ఏసీపీ రమేశ్, జీఐటీఎల్ అధికారులు ఎంకే తుతేజ, రాగేశ్, నవీన్‌పటేల్, ఆనంద్, రుషబ్, రితుల్, ప్రసాద్, నితిన్ పాల్గొన్నారు.

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

- హెడ్‌కానిస్టేబుల్‌పైనా వేటుకు రంగం సిద్ధం
- పోలీసు శాఖలో చర్చనీయాంశం

జగిత్యాలక్రైం: మల్లాపూర్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుళ్లు సురేశ్, ధనుంజయ్‌లను సస్పెండ్ చేస్తూ ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఠాణాకు మద్యం తెచ్చుకొని, ఇద్దరు ప్రజాప్రతినిధులతో విందు చేసుకున్న సంఘటనపై ఆయన చర్యలు తీసుకున్నారు. హెడ్‌కానిస్టేబుల్ అశోక్‌పైనా వేటుకు రంగం సిద్ధమైంది. మల్టీజోన్-1 ఐజీకి నివేదిక సమర్పించినట్లు ఎస్పీ తెలిపారు. 1, 2 రోజుల్లో చర్యలు ఉండనున్నాయి. ఈ ఘటన జిల్లాలో చర్చనీయాంశమైంది.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి దుర్మరణం

- మృతురాలి మనవడికి తీవ్ర గాయాలు



కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని మీర్జంపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతిచెందగా ఆమె మనవడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. ఓదెల మండలంలోని గుంపుల గ్రామానికి చెందిన తిప్పారపు ఓదమ్మ(75) గురువారం తన మనవడు విఘ్నేశ్‌తో కలిసి బైక్‌పై మీర్జంపేటలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైంది. తిరిగి స్వగ్రామం వస్తుండగా ఓ కారు అతివేగంగా వచ్చి, ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓదమ్మ అక్కడికక్కడే మృతిచెందగా విఘ్నేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తీసుకెళ్లారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, విచారణ చేపట్టారు.

ఆర్టీసీ బస్సులో వృద్ధుడి మృతి

మెట్‌పల్లి(కోరుట్ల): ఆర్టీసీ బస్సులో ఓ వృద్ధుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్‌కు చెందిన బోగం సాయయ్య(70) హుజూరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి గురువారం ఆర్టీసీ బస్సులో నిజామాబాద్ వస్తున్నాడు. మెట్‌పల్లి శివారులోకి రాగానే తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. డ్రైవర్ బస్సును నిలిపివేసి, 108కు సమాచారమిచ్చారు. సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని, బాధితుడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను మృతిచెందినట్లు నిర్ధారించారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

- వీరిలో ఒకరు మైనర్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్



పెగడపల్లిలో..

రాయికల్(జగిత్యాల): గంజాయిని విక్రయించేందుకు వెళ్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. రాయికల్ ఠాణా లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ వివరాలు వెల్లడించారు. జగిత్యాల పట్టణానికి చెందిన కొండూరి రాజేశ్, అరుముల్ల సాయికుమార్‌లకు అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన ఓ బాలుడితో పరిచయం ఏర్పడింది. అతను అక్కడ తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి, జగిత్యాలకు తీసుకువచ్చాడు. స్థానిక యువతకు ఎక్కువ ధరకు విక్రయించాలని భావించి, గురువారం బైక్‌పై రాయికల్ వస్తున్నారు. అదే సమయంలో కుమ్మరిపల్లి శివారులో ఎస్సై అజయ్ వాహనాల తనిఖీ చేస్తుండగా వీరు అనుమానాస్పదంగా కనిపించారు. తనిఖీ చేయగా కిలోన్నర గంజాయి లభ్యమైంది. గంజాయితోపాటు ద్విచక్రవాహనం, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని, ఆ ముగ్గురినీ అరెస్టు చేశారు. వారిని చాకచక్యంగా పట్టుకున్న జగిత్యాల రూరల్ సీఐ ఆరిఫ్ అలీఖాన్, ఎస్సై అజయ్, కానిస్టేబుళ్లు సాగర్, ప్రశాంత్‌లను ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అభినందించారు. సాయికుమార్ తల్లిదండ్రులు తమ కొడుకును పోలీ సులు అన్యాయంగా అరెస్టు చేశారంటూ రాయికల్ ఠాణాకు వచ్చి, విలేకరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై డీఎస్పీని వివరణ కోరగా అన్ని సాక్ష్యాలతో అరెస్టు చేశామని పేర్కొన్నారు.

పెగడపల్లి నంది చౌరస్తా వద్ద ఇద్దరు..

పెగడపల్లి(ధర్మపురి): గంజాయి తరలిస్తున్న ఓ యువకుడు, ఓ బాలుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. పెగడపల్లి పోలీస్‌స్టేషన్‌లో సంబంధిత వివరాలు వెల్లడించారు. పెగడపల్లి నంది చౌరస్తా వద్ద ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని కొండాయపల్లికి చెందిన ఇడుగునూరి వంశీకృష్ణ, ఓ బాలుడు బైక్‌పై వెళ్తూ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని ఆపి, తనిఖీ చేయగా బ్యాగులో 900 గ్రాముల గంజాయి లభ్యమైంది. బైక్‌ను స్వాధీనం చేసుకొని, ఇద్దరినీ అరెస్టు చేశారు. పోలీసులను డీఎస్పీ అభినందించారు. గంజాయి తరలించినా, విక్రయించినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు గంజాయి విక్రేతలపై ఉక్కుపాదం మోపుతున్నామని తెలిపారు. సమావేశంలో సీఐ రవి, ఎస్సై రామకృష్ణ, ఏఎస్సై సత్తయ్య, పోలీస్ సిబ్బంది రవీందర్, వెంకట్‌రెడ్డి, తిరుపతి, ఎల్లయ్య పాల్గొన్నారు.